క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ ఉమాకాంత్

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ సీఐ ఉమాకాంత్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మురళీనగర్‌లో స్థానికులకు మట్టి విగ్రహాలు అందిస్తున్న కృష్ణారెడ్డి

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో పర్యావరణ హితమైన వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో భాగంగా మట్టి విగ్రహాలను ఆదివారం పంపిణీ చేశారు. స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి 500 మందికి విగ్రహాలు అందించారు. ప్రజలందరూ మట్టి గణపతిని పూజించి కాలుష్యం నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, ఎస్.వరప్రసాద్, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల రక్తదానం



రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సమాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీ అపరంజి పర్యవేక్షణలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో మురళీనగర్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. భారతదేశంతోపాటు నేపాల్‌లో 6 వేల సేవా కేంద్రాల్లో లక్ష యూనిట్ల రక్తం సేకరణలో భాగంగా రక్తదానం చేసినట్లు అపరంజి తెలిపారు. రక్తదానంలో బ్రహ్మకుమారీలతోపాటు మురళీనగర్ వాసులు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ 'శంకు' మృతికి సంతాపం

మురళీనగర్: జాతీయ, అంతర్జాతీయ కార్టూనిస్ట్, దూరదర్శన్ డాక్యుమెంటరీలు, ధారావాహికల నిర్మాత, దర్శకుడు శంకు (సంపర భీమ శంకర్‌కుమార్) మృతికి నార్త్ కోస్టల్ ఆంధ్రా కార్టూనిస్టుల ఫోరం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఆదివారం శంకు మరణించారు. ఫోరం సభ్యులు శర్మ, టీఆర్ బాబు, లాల్, ఓంకార్, రఘు, వర్మ, ప్రేమ్, పరిశినాయుడు, కన్నాజీ రావు తదితర కార్టూనిస్టులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. శంకు మరణం కార్టూన్ రంగంలో తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి దంపతులు

కంచరపాలెం: కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మహో ఘనపతిం

- చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న గణనాథులు
- కోల్‌కతా మట్టి విగ్రహాలకు ఫుల్ డిమాండ్
- 3 నుంచి 22 అడుగుల సైజుల్లో లభ్యం
- 25 ఏళ్లుగా అక్కయ్యపాలెంలో తయారీ



22 అడుగుల మట్టి గణపతికి రంగులు అద్దుతున్న కళాకారుడు



ఆకట్టుకుంటున్న శివగణపతి



శేషతల్పంపై విష్ణు రూపంలో గణనాథుడు

సీతంపేట: వినాయక చవితి పండగ సమీపించడంతో తొలి పూజలందుకోడానికి మృణ్మయ గణనాథులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27 నుంచి వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో వీధుల్లో గణపతి మండపాలు ఏర్పాటు చేసి మట్టి విగ్రహాలను కొలిచేందుకు యువతలో ఆసక్తి పెరిగింది. గతంలో కంటే నగరంలో మట్టి, వాటర్ కలర్స్‌తో తయారు చేసిన మట్టి విగ్రహాల వినియోగం పెరిగింది. ఆస్‌బెస్టాస్‌తో తయారు చేసిన బొమ్మల కంటే ధర కాస్త ఎక్కువైనా మట్టి ప్రతిమలు ఏర్పాటు చేసేందుకు ఉత్సవ నిర్వాహకులు మొగ్గుచూపుతున్నారు. దీంతో కోల్‌కతా కళాకారులు తయారు చేస్తున్న మట్టి గణపతి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది.

ఫొటో ఇస్తే చాలు..


ఉత్సవాలకు వినాయక విగ్రహం ఏ విధంగా కావాలో ఒక్క ఫొటో ఇస్తే చాలు.. కోల్‌కతా కళాకారులు అదే విధంగా ఆకారం, రూపం, రంగు ఏ మాత్రం తేడా లేకుండా మట్టితో విగ్రహాన్ని తయారు చేసి ఇస్తున్నారు. మూడడుగుల నుంచి 25 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు.

విభిన్న రూపాలు..

3 అడుగుల ఎత్తు నుంచి 22 అడుగుల ఎత్తయిన మట్టి విగ్రహాలు చూడముచ్చటగా ఆకట్టుకునే రీతిలో కళాకారులు తయారు చేస్తున్నారు. మంచి ఫినిషింగ్ కోసం కోల్‌కతా నుంచి ప్రత్యేకంగా గంగానది మట్టిని తీసుకురావడం విశేషం. సుమారు 30 రకాలకు పైగా వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు. శేషతల్ప విష్ణురూప గణపతి, గజముఖ గణపతి, మత్స్య గణపతి, సింహాద్రి అప్పన్న, శివరూప గణపతి, ఆంజనేయ గణపతి, కృష్ణవతార గణపతి, త్రిమూర్తులు, కాణిపాక గణపతి, హైదరాబాద్ గణపతి, శివపూజ గణపతి, మహారాజా గణపతి, మయూర గణపతి, బాలాజీ గణపతి, అయ్యప్ప గణపతి, కుమారస్వామి గణపతి ఇలా ఎన్నో వెరైటీ విగ్రహాలను రూపొందిస్తున్నారు.



మట్టితో తయారు చేసిన కుమారస్వామి రూప గణపతి



మహారాజా గణపతికి తుది మెరుగులద్దుతున్న కళాకారుడు

కోల్‌కతా కళాకారుల నైపుణ్యం

చవితి పండగకు మూడు నెలల ముందుగా కోల్‌కతా నుంచి కళాకారులు విశాఖ వచ్చి విభిన్న రూపాలు, వివిధ సైజుల్లో మట్టి విగ్రహాలను తయారు చేస్తుంటారు. అక్కయ్యపాలెం జగన్నాథపురం రోడ్డు, రామచంద్రానగర్, శంకరమఠం పక్కన తాత్కాలిక షెడ్లల్లో మట్టి గణపతులను తయారు చేసి విక్రయాలకు సిద్ధం చేస్తుంటారు. కోల్‌కతా కళాకారులు కొకోన్, నోవాపాల్ బృందం 25 ఏళ్ల నుంచే నగరంలో మట్టి విగ్రహాలు తయారు చేసి అందిస్తుండటం విశేషం. మట్టి ప్రతిమలు వాడాలని, పర్యావరణం కాలుష్యం కాకుండా చూడాలని చేస్తున్న ప్రచారం ప్రజల్లో చాలా వరకు మార్పు తెచ్చింది. ఖర్చు ఎక్కువైనా మట్టి విగ్రహాలు, హానికరం కాని రంగులు విగ్రహం తయారీలో వాడాలని ఉత్సవ నిర్వాహకులు ఆసక్తి చూపిస్తున్నారు.

పర్యావరణ హితంగా..

కొకోన్, నోవాపాల్ బృందం 25 ఏళ్ల కిందట విశాఖ వచ్చి మట్టి విగ్రహాల తయారీని ప్రారంభించారు. ప్రతి ఏటా వినాయక చవితికి రెండు నెలల ముందుగా కళాకారులతో మట్టి విగ్రహాల తయారీని ప్రారంభిస్తారు. మట్టి, సరుగుడు కర్ర, గడ్డి, వాటర్ కలర్స్ వినియోగించి హానికరం కాని విగ్రహాలను రూపొందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. మట్టిలో సులువుగా కలిసిపోయే సామగ్రితోనే కోల్‌కతాలో విగ్రహాలు తయారు చేస్తారని, ఆ పద్ధతినే విశాఖలో ప్రవేశపెట్టామని, 25 ఏళ్లుగా విశాఖ ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని కళాకారులు కొకోన్, నోవాపాల్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలల పని



ఏటా మూడు నెలల పాటు కోల్‌కతా నుంచి విశాఖ వచ్చి వినాయకుడు, దుర్గాదేవి విగ్రహాలు తయారు చేస్తాం. గంగానది మట్టి, ఆర్గానిక్ కలర్స్‌తో రూపొందిస్తాం. విగ్రహాల తయారీ చోటే వండికుని తినేసి పడుకుంటాం. 15 ఏళ్లుగా విశాఖ వస్తున్నాను. ఇక్కడి ప్రజలు మట్టి విగ్రహాలను బాగా ఆదరిస్తున్నారు.

– సమీర్‌దాస్, కళాకారుడు, కోల్‌కతా

మట్టి విగ్రహాలకు ఆదరణ



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కంటే మట్టితో విగ్రహాలు రూపొందించడం చాలా కష్టమైన పని. 15 అడుగుల మట్టి బొమ్మ తయారీకి నలుగురు కళాకారులు 10 రోజులు కష్టపడాల్సి ఉంటుంది. మూడడుగుల బొమ్మ తయారీకి ఒక వ్యక్తి రెండు రోజులు పనిచేయాలి. సైజును బట్టి రూ.7 వేల నుంచి రూ 1.20 లక్షల వరకు ఖరీదైన బొమ్మలు తయారు చేస్తున్నాం. గతేడాది 130 విగ్రహాలకు ఆర్డర్లు రాగా.. ఈ ఏడాది 90 విగ్రహాలకు వచ్చింది. 12 మంది కళాకారులతో ఆర్డర్లు మేరకు తయారు చేస్తున్నాం. నర్సీపట్నం నుంచి 22 అడుగుల భారీ విగ్రహానికి ఆర్డర్ వచ్చింది. తమ దగ్గరకు వచ్చే వారు రకరకాల కాన్సెప్ట్‌లు చెబుతుంటారు. ఫొటోలు ఇచ్చి వారికి కావలసిన విధంగా విగ్రహాలు తయారు చేసి ఇస్తుంటాం.

– కొకోన్, విగ్రహ తయారీదారుడు, కోల్‌కతా

పేద ముస్లింలకు ఉచితంగా వివాహాలు



మాట్లాడుతున్న ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఆదివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి, విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు తగిన సంబంధాలను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 10 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా ఇప్పటి వరకు సుమారు 400 మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు భరించి, ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మీర్ అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి సయ్యద్ అమీర్‌జాన్, సహాయ కార్యదర్శి మహబూబ్ ఆలీ ఖాన్, కోశాధికారి షేక్ అహ్మద్ వలీ, సొసైటీ సభ్యులు మహ్మద్ హబీబ్, రహ్మతుల్లా, మెహబూబ్ షరీఫ్, మొహ్మద్ లుక్మన్, అస్గర్ ఆలీ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



ఆరోగ్య సూచనలిస్తున్న డాక్టర్ రవీంద్ర వర్మ



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ, వాసన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవీంద్ర వర్మ మాట్లాడుతూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి రోజూ 8 లీటర్ల నీరు తాగాలన్నారు. కిడ్నీ సమస్యలకు కారణాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ జి.రవీంద్రవర్మ, డాక్టర్ శ్రీరామ్‌లతో కూడిన వైద్య బృందం స్థానికులకు బీపీ, సుగర్, ఇతర శరీర సమస్యలపై వైద్య పరీక్షలు చేశారు. వాసన్ ఐ కేర్ కంటి నిపుణులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి నాగేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

- మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, సుగర్, ఇతర సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో క్లబ్ సభ్యులు, స్పోర్ట్స్ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, రాజు, సభ్యులు పాల్గొని సహకరించారు.

అయ్యప్ప భక్తుల సేవలో 'చిన్ముద్ర ట్రస్ట్'

సీతంపేట: అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల ట్రస్ట్ సభ్యుల సమావేశం ఆదివారం శంకరమఠంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాష్ట్రాలు, జిల్లాల వారీగా ట్రస్ట్ సభ్యుల సమక్షంలో కమిటీల ఏర్పాటు దిశగా ముందుకెళ్లాలని, ట్రస్టు ద్వారా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. కొన్ని సంస్థలు తెలుగు అయ్యప్ప స్వాములకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని తీర్మానించారు. తెలుగు రాష్ట్రాల నుంచి 60 శాతం భక్తులు, అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తున్నా.. తెలుగు వారికి సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఇకపై ఇలాంటి పరిణామాలు ఎదురు కాకుండా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ ప్రభుత్వంతో, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల సహకారంతో అయ్యప్పల రక్షణ, సేవకు అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ముందుంటుందని తెలిపారు. త్వరలో అనంతపురంలో రెండో సమావేశం ఉంటుందన్నారు. ట్రస్టు సభ్యులు పి.ఆదిమోహన్‌రెడ్డి, రుద్ర కోటేశ్వరరావు, సిరిసేటి రాజేష్‌గౌడ్, బి.ఈశ్వరయ్య, కర్మా సిద్దు, బాలు లెంకల, అనంతరావు, వైకుంఠరావు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ



విశాలాక్షినగర్‌లో ర్యాలీగా బయలుదేరిన ఏఆర్ పోలీసులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం నుంచి అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. కైలాసగిరి కూడలి నుంచి బయలుదేరి జోడుగుళ్లపాలెం నుంచి బీచ్ రోడ్డులో సీతకొండ మీదుగా సాగర్‌నగర్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కీలకమన్నారు. ఆరోగ్యం దేశాన్ని బలోపేతం చేసి శక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మథరావు, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సింగిల్ విండోతో చవితి వేడుకలు

- అనుమతులు, నిబంధనలు తప్పనిసరి
- ఆన్‌లైన్, సచివాలయాల ద్వారా దరఖాస్తులు
- చురుగ్గా వినాయక మండపాల ఏర్పాట్లు



53వ వార్డు పార్వతీనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం



53వ వార్డు శ్రీనివాసనగర్‌లో సిద్ధం చేస్తున్న మండపం

మద్రిపాలెం: వినాయక చవితి వేడుకలు ఎటువంటి విఘ్నాలు లేకుండా ప్రశాంతంగా జరగాలని, గణనాథుడు చల్లగా చూడాలని భక్తులందరూ పూజలు చేస్తుంటారు. ఊరూవాడా పందిళ్లు వేసి వినాయకుడి విగ్రహాలు పెట్టి నవరాత్రి ఉత్సవాలు చేయడం రివాజుగా వస్తోంది. చవితి ఉత్సవాలు నిర్వహించాలంటే పలు రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. జీవీఎంసీ, ఫైర్, పోలీస్ ఇలా భద్రతకు సంబంధించి ఆయా శాఖల అనుమతులు తీసుకోవాలి. ఈ ఏడాది సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని పోలీస్ కమిషనర్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి నిర్వాహకులు తమ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయాల్లో కూడా దరకాస్తు చేసుకోవచ్చని సంబంధింత స్టేషన్ పోలీసులు చెబుతున్నారు. నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆయా ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్, జీవీఎంసీ, ఫైర్ ఇలా సంబంధిత శాఖలకు పందిళ్ల దరఖాస్తు వివరాలు వస్తాయి. ఆయా శాఖల వారు అక్కడకి వెళ్లి నిబంధనలు సరిగ్గా పాటిస్తున్నారో లేదో చూసి.. పర్మిషన్ ఇస్తారు. సింగిల్ విండో పేరిట అన్ని రకాల అనుమతులు రావడంతో నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల్లో మండపాల ఏర్పాటు

జీవీఎంసీ 51, 53 వార్డుల్లో అనేక ప్రాంతాల్లో వినాయ మండపాలు ఏర్పాటు చేస్తుండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఎటు చూసినా పందిళ్ల ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమై ఉన్నారు. ప్రతి ఏటా వచ్చే ప్రథమ పూజ కావడంతో గణనాథుడి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

నిబంధనలు ఇవే..

- వినాయక చవితి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య లౌడ్ స్పీకర్లు వినియోగించరాదు.
- ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పందిళ్లు వేయాలి.
- కేవలం భక్తి పాటలు మాత్రమే వేయాల్సి ఉంటుంది.
- పూజలు ముగిశాక ముఖ్యంగా అనుపు ఉత్సవం కూడా పోలీసులు నిర్ణయించిన చోట మాత్రమే నిర్వహించాలి.
- మద్యం తాగి అనుపులో నృత్యాలు వేయరాదు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి.
- ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని ఉత్సవ నిర్వాహకులకు పోలీసులు సూచిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వినాయక చవితి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఎటువంటి నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవు. నిర్వాహకులు పందిళ్లు ఏర్పాటు చేసేందుకు తప్పక అనుమతి పొందాలి. పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించకూడదు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. డీజే సౌండ్లు, పాటలు, పెద్ద ఎత్తున కేకలు వేయడం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. వాటికి అసలు అనుమతులు లేవు. సింగిల్ విండో విధానం ద్వారా ఎంతో ఉపయోగం. నిబంధనలను ఉల్లంఘించిన వారికి అనుమతులు ఇవ్వలేదు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, సంతోషంగా పండగ జరుపుకోవాలి.

– **కె.రవికుమార్**, ఐదో పట్టణ సీఐ, కంచరపాలెం

మట్టి విగ్రహాలను పూజిద్దాం



నరసింహనగర్ రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సీతంపేట: ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం నరసింహనగర్ రైతుబజార్‌లో మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే లఘునాటిక ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మట్టి విగ్రహాలు, హానికరం కాని రంగులను ఉపయోగించి తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను పూజించవద్దని సూచించారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుబజార్ల సెలవు రద్దు

వినాయక చవితి సందర్భంగా రైతుబజార్లకు మంగళ, బుధవారాల్లో సెలవు లేదని, యథావిధిగా కొనసాగుతాయని రైతుబజార్ ఈవో కొండబాబు తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు.

విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలూ అవసరమే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: భారత నాట్య కళాంజలి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 11వ వార్షికోత్సవం ఆదివారం సిరిపురం జంక్షన్‌లో ఉన్న గురజాడ కళాక్షేత్రంలో వేడుకగా నిర్వహించారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పెదవీరరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి వెంకటకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాట పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఇనిస్టిట్యూట్ గురువులు సంతోషి, విజయ్ వార్షికోత్సవం నిర్వహిస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, రుక్మిణీదేవి ఫైన్ ఆర్ట్స్ కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ వసుంధర థామస్ పాల్గొన్నారు.